# 9 ఎల్షద్దాయి సంఘ అభివృద్ధి

కృపగల మా దేవా! యేసురాజా! నీకు స్తుతులు స్తోత్రములు.
దేవా, మా యేసయ్యా! ఎల్షద్దాయి సంఘమును నిత్యము నీ జ్ఞాపకములో
ఉంచుకొనినందులకు నీకు వేవేల స్తుతులు, స్తోత్రములు.

ఈ 30 యేండ్ల సంఘసేవా పరిచర్యలో జరిగిన ప్రతి ఓటమిని
విజయవంతముగా మార్చినందులకు మేము నీకేమి చెల్లించగలము!
కేవలము రక్షణ పాత్రను చేతపట్టుకొని
ఆనంద గానప్రతిగానములతో నిన్ను స్తుతించగలము. ఎన్ని శ్రమలు ఎదురైనను,
ఎన్ని బాధలు బంధించినను, అవమానములు మా గుండెలపైన నాట్యమాడినను
యేశ్రమ ద్వారానైనను, యే శోధన ద్వారానైనను మేము నశించిపోకుండా
ఇంతవరకు మమ్ములను కాచి, కాపాడిన నీ మహోన్నతమైన కృపాసత్యములనుబట్టి
నీకే కృతజ్ఞతాస్తుతి, మహిమ, ఘనత, ప్రభావములు చెల్లించుకొనుచున్నాము. ఆమేన్.
తండ్రీ! ఈ శ్రమల కొలిమిలో విశ్వాస పరీక్షలో విధేయతనేర్చుకొని నీ చిత్తమును
నెరవేర్చేవారముగా మమ్ములను మలచుచున్నందులకు నీకే స్తోత్రములు.

సంఘము ఎదుట " పాతాళలోక ద్వారములు నిలువనేరవని",
మత్తయి 16:18 లో సెలవిచ్చిన యేసయ్యా! ఎల్షద్దాయి సంఘమును
శక్తివంతమైన సంఘముగా మలచండి.
పాతాళలోకమును, దురాత్మల సమూహమును ఎదురించి జయించే
సంఘముగా తయారుచేయండి.
క్రీస్తుయేసు ప్రభువా! ఎల్షద్దాయి సంఘమునకు నీవే పునాదివి.
ప్రభువా! మమ్ములను బలపరచండి. సంఘసేవను సఫలపరచండి.
మా ప్రయత్నములను ఆశీర్వదించండి.
అభివృద్ధిచెందవలసిన స్థాయిలో అభివృద్ధి చెందలేకపోవుచున్నామని
వ్యాకులపడుచున్నాము.
మమ్ములను అభివృద్ధిపరచండి. సర్వసమృద్ధిలోనికి నడిపించండి.
ప్రభువా! నీ వాగ్దానములన్నింటిని మేము నమ్ముచున్నాము.
"వారిలో ఒంటరియైన వాడు వేయిమంది అగును, ఎన్నికలేని వాడు బలమైన
జనమగును; యెహోవానగు నేను తగిన కాలమున ఈ కార్యమును త్వరపెట్టుదును".
అని యెషయా 60:22లో సెలవిచ్చిన దేవా! నీకు స్తుతులు, స్తోత్రములు.

ఎల్షద్దాయి సంఘమును వేయి కుటుంబముల సంఘముగా
అభివృద్ధిపరచి ఆశీర్వదించండి;
ప్రభువా! 30 సంవత్సరములుగా నీ పాదసన్నిధిలో వేచియున్నాము.
ప్రభువా! మాపై కనికరం చూపించండి.
అభివృద్ధికిని, సమృద్ధికిని ఇదే తగిన కాలమని మేము విశ్వసించుచున్నాము.

రండి దేవా! మమ్మును ఆశీర్వదించరండి.
రండి దేవా! నీ ఘనమైన కార్యములను త్వరపెట్టరండి.
రండి దేవా! నీ సంఘమును పరిపాలించరండి.

"నన్ను అడుగుము, జనములను నీకు స్వాస్థ్యముగాను
భూమిని దిగంతముల వరకు సొత్తుగాను ఇచ్చెదను".
అని కీర్తనలు 2:8లో సెలవిచ్చిన దేవా, యెహోవా! మాపై దయచూపండి.
నీ పేరు పెట్టబడిన ఎల్షద్దాయి సంఘము మీద నీ కనుదృష్టి ఉంచండి.
"అడుగుము" అని నీవు సెలవిచ్చావు గనుక ధైర్యము చేసి నీ నామములో
అడుగుచున్నాము. జనములను ఎల్షద్దాయి సంఘమునకు స్వాస్థ్యముగా ఇవ్వండి.

ప్రభువా! కనీసము వెయ్యిమంది కుటుంబములను
సంఘమునకు స్వాస్థ్యముగా ఇవ్వండి.
ఎల్షద్దాయి పరిశుద్ధ పరిచర్యలను భూదిగంతముల వరకు విస్తరింపజేయండి.
ఇంతవరకు మేము చేసిన ప్రతి తప్పులను, పాపములను క్షమించండి.
కృపా కనికరములుగల దేవా! యే అవిధేయతనుబట్టి, యే అజ్ఞానమునుబట్టి
మేము ఇన్ని సంవత్సరములు ఫలించలేక పోయామో
దానినిబట్టి పశ్చాత్తాపపడుచున్నాము.
మా అవిధేయతను క్షమించండి. సాతానును ఎదురించలేక
అనేక పర్యాయములు ఓడిపోయియున్నాము.
సాతానును బంధించి మాకు విజయము దయచేయండి.

సంఘమునకు శిరస్సువైన యేసయ్యా! నీ శరీరమనే సంఘము వేదనలతో,
శ్రమలతో బాధించబడుచున్నది. మమ్ములను విడిపింపరండి.
సంఘములో సమాధానము లేదు; కుటుంబముల మధ్యన గొడవలు,
భార్యభర్తల మధ్యన సఖ్యత లేదు; రోగములతో,
వ్యాధులతో సంఘస్తులు విలవిలలాడిపోవుచున్నారు.
ఏ కుటుంబములో చూసిన అప్పులు, ఆర్థిక సమస్యలు.

ప్రభువా! ఎల్షద్దాయి సంఘసహవాసము కనికరించండి.
సంఘసభ్యులలో వున్న అవిధేయతను తీసివేయండి.
మాలో వున్న అస్థిరత్వమును, ద్విమనస్కను తీసివేయండి.
విజయవంతమైన మాదిరికరమైన క్రైస్తవ జీవితమును మాకు ప్రసాదించండి.
9 ఆత్మ ఫలములను సంఘములో అందరికి దయచేయండి.
"దేవుని మందిరములో, అనగా జీవముగల దేవుని సంఘములో,
జనులేలాగు ప్రవర్తింపవలెనో
అది నీకు తెలియవలెనని ఈ సంగతులను నీకు వ్రాయుచున్నాను."
అని 1తిమోతి 3:15లో వ్రాయించిన పరిశుద్ధాత్మ దేవా!
ఎల్షద్దాయి ప్రార్థన శిఖరమనెడి నీ మందిరములోను, సంఘములోను మేమేలాగు
ప్రవర్తించవలెనో మాకు నేర్పించండి. మా ప్రవర్తనను సరిచేయండి.
మా ప్రవర్తనలో వున్న ప్రతి లోపమును సరిదిద్దుకొనుటకు
మేము సిద్ధముగావున్నాము. మమ్ములను పరిపూర్ణులుగా తయారుచేయండి.

దేవా! మమ్ములను మలచండి.
దేవా! సంఘమును ఆశీర్వదించండి.
దేవా! మాలోవున్న దుష్టున్ని పారద్రోలండి.
దేవా! నీవే కాపరివైయుండి మమ్ములను కాయండి.
దేవా! నీవే ప్రధాన కాపరివైయుండి, నీ వాక్యముతో మమ్ములను మేపండి.
దేవా! నీవే రాజువైయుండి ఎల్షద్దాయి సంఘమును ఏలండి, పరిపాలించండి.
దేవా! ఎల్షద్దాయి సంఘమును వెయ్యికుటుంబముల సంఘముగా ఆశీర్వదించండి.
దేవా! దయయుంచి మా మనవిని ఆలకించమని నీ సన్నిధిలో గోజాడుతున్నాము.

ప్రభువా! 1997వ సంవత్సరము సంఘమును ప్రారంభించినప్పటి నుండి
ఎందరైతే ఎల్షద్దాయి సంఘము ద్వారా నీ కృపలో రక్షింపబడి,
బాప్తిస్మము పొందుకొని సంఘము నుండి తప్పిపోయివున్నారో,
చెదరిపోయివున్నారో, అవిశ్వాసులైయున్నారో, విగ్రహారాధికులుగా
మారిపోయిన్నారో వారందరిని దయతో క్షమించి నీ కృపాబాహుళ్యమునుబట్టి
తిరిగి సంఘములోనికి సమకూర్చండి.
దయగల ప్రభువా! తప్పిపోయిన ప్రతి ఒక్కరు తిరిగి మాకు కావాలి.
దుష్టుని కోరల నుండి వారిని విడిపించండి. ఎందరెందరు నీ మహాకృప ద్వారా
అద్భుతములను రుచిచూచి, స్వస్థతలను పొందుకొని, పరిశుద్ధాత్మలో పాలివారై కూడా
సంఘమును విడిచిపెట్టి, త్రోవతప్పిపోయి, లోకమును స్నేహించి
తిరుగులాడుచున్నారో వారందరిని సంఘమునకు తిరిగి నడిపించండి.
బంధకాలనుండి వారిని విడిపించండి.
దేవా, వారి మనో నేత్రములను తెరవండి. దేవా! మా మొఱ్ఱ ఆలకించండి.
పటిష్టమైన సంఘముగా ఎల్షద్దాయి సంఘమును పునఃనిర్మించండి.

ప్రభువా! మాకు సమృద్ధి జీవము కావాలి; దయచేయండి.
ప్రభువా! నీవు స్వరక్తమిచ్చి సంపాదించిన నీ సంఘమునుకు నీవె కాపరివి.
పరిశుద్ధాత్మ దేవా! మమ్ములను ఎల్షద్దాయి సంఘములో స్థిరపరచి బలపరచండి.
మాదిరికరమైన సంఘముగాను, జీవముగలిగిన సంఘముగాను తయారుచేయండి.
“నా మందిరము సమస్త అన్యజనులకు ప్రార్థన మందిరమనబడును".
అని మార్కు 11:17లో సెలవిచ్చిన యేసయ్యా!
ఎల్షద్దాయి ప్రార్థన మందిరమునకు అనేకమంది అన్యజనులను నడిపించండి.
వేలాదిమంది అన్యులు నీ పరిశుద్ధరక్తముచే కడుగబడి, రక్షింపబడి,
బాప్తిస్మము పొందుకొని సంఘములో స్థిరపరచబడునట్లు నడిపించండి.
దేవా! తప్పిపోయిన, చెదిరిపోయిన పాతసభ్యులందరిని తిరిగి సమకూర్చండి.
నూతనముగా అనేకమంది అన్యజనులను సంఘమునకు అనుగ్రహించండి.

ప్రభువా! మమ్ములను కరుణించండి.
ప్రతివారము సంఘములో క్రొత్త ప్రజలను చేర్చండి.
వాక్యమనే ఆహారముతో మా ఆత్మలను బలపరచండి.
మా ప్రాణాత్మ దేహములను దినదినము శుద్ధీకరించండి. బుద్ధిగలిగిన కన్యకలవలె
నీ రాకడ కొరకు మెలకువతో ఎదురుచూస్తు వుండడానికి కావలసిన
సిద్ధపాటును మాకు దయచేయండి. మా హృదయమనే దివిటీలలో
పరిశుద్ధాత్మ అనే నూనెను సమృద్ధిగా వుంచండి.
మాలో ఏదైనా బుద్ధిహీనత వుంటే తీసివేయండి.

"సంఘము విశ్వాసమందు స్థిరపడి, అనుదినము లెక్కకు విస్తరించుచుండెను",
అని అపోస్తులకార్యములు 16:5లో వ్రాయబడినట్లు ఎల్షద్దాయి సంఘమును కూడా
విశ్వాసమునందు స్థిరపరచి అనుదినము విస్తరింపజేయండి.
పౌలుచేత విశేషమైన అద్భుతములను చేయించిన దేవా! నీకు స్తోత్రములు.
ఎల్షద్దాయి సంఘములో కూడా అద్భుతములను, ఆశ్చర్యకార్యములను చేయండి.
"అతడు నాకు మొఱ్ఱపెట్టగా నేనతనికి ఉత్తరమిచ్చెదను,
శ్రమలలో నేనతనికి తోడైయుండెదను, అతని విడిపించి గొప్పచేసెదను".
అని కీర్తనలు 91:15లో వాగ్దానము చేసిన దేవా! మేము నీకు మొఱపెట్టుచున్నాము;
మా ప్రార్థనకు జవాబు దయచేయండి. శ్రమలలో వున్నాము. కృప చూపించండి.
30 సంవత్సరములుగా ఎన్నో కష్టములు, బాధలు, శోధనలు, వ్యతిరేకతలు,
అవమానములు, ఇబ్బందులు ఎదుర్కొనుచున్నాము.

దేవా, మమ్ములను విడిపించరండి.
ఇశ్రాయేలీయుల మొఱ్ఱను విని వారిని విడిపించడానికి
హోరేబు కొండమీదికి దిగివచ్చిన దేవా!
మా మొఱ్ఱను కూడా ఆలకించి మమ్ములను కూడా సాతాను
బంధకములనుండియు, సమస్యవలయమునుండియు విడిపించరండి.
నీ నామమహిమార్థమై ఎల్లద్దాయి సంఘసహవాసమును గొప్పచేయండి.
వాగ్దానములను నెరవేర్చువాడా, నీకు స్తుతులు స్తోత్రములు.
అభివృద్ధి చెందవలసిన స్థాయిలో సంఘము అభివృద్ధి చెందలేదని,
యాకోబు 4:9 లో చెప్పబడిన విధముగా ఎంతో వ్యాకుల పడుతున్నాము;
దుఃఖపడుచున్నాము; ఏడ్చి మొఱ్ఱపెడుతున్నాము.
దేవా యేసుదేవా! నీకును, నీ వాక్యమునకును,
నీ రాజ్యమునకును విరోధముగా చేసిన ప్రతి తప్పునుబట్టి
పశ్చాత్తాపపడుచున్నాము. కరుణించి మాపై కృపచూపించండి.
నీ సంఘమును, నీవు సంరక్షించనిచో ఎవరు సంరక్షిస్తారు!
నీవే మాదిక్కు.
"మీరు బహుగా ఫలించుటవలన నా తండ్రి మహిమపరచబడును."
అని యోహాను 15:8 లో సెలవిచ్చిన యేసయ్యా!
సంఘమును బహుగా ఫలింపజేయండి.

ప్రభువా! మమ్మును ఆత్మీయ జీవితంలో బహుగా ఫలింపజేయండి.
ప్రభువా! సంఘమును ప్రార్థన ఆత్మతో నింపండి.
దానియేలు వలెను, షద్రకు మేషాకు అబేద్నెగోలవలెను రోషము గలిగి నీ కొరకు
జీవించడానికి కావలసిన విశ్వాసమును, ధైర్యమును దయచేయండి.
"సమాధానకర్తయగు దేవుడు సాతానును మీ కాళ్ల క్రింద
శీఘ్రముగా చితుకత్రొక్కించును",
అని రోమా 16:20లో సెలవిచ్చిన దేవా! ఎల్లద్దాయి సంఘము
పాదములక్రింద సాతానును శీఘ్రముగా చితుకత్రొక్కించండి.
సాతానుపై మాకు సంపూర్ణ విజయమును దయచేయండి.
రోగములపై, దారిద్రముపై మాకు విజయమును దయచేయండి.

"దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి,
అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును", అని
యాకోబు 4:7లో సెలవిచ్చిన పరిశుద్ధాత్మ దేవా! నీకు స్తోత్రములు.
దేవా! నీకు లోబడి జీవించుట మాకు నేర్పించండి,
నీ వాక్యమునకు లోబడి జీవించుట మాకు నేర్పించండి,
నీ ఆజ్ఞలకు లోబడి జీవించుట మాకు నేర్పించండి.

దేవా! అపవాదిని ఎదిరించడానికి నీ శక్తిని మాకు దయచేయండి.
నీ పరిశుద్ధాత్మశక్తితో మమ్ములను నింపండి.
సాతాను యొక్క అంధకారమును మా యొద్ద నుండి తీసివేయండి.

యేసయ్యా! మాకు విజయము కావాలి,
యేసయ్యా! మాకు అభివృద్ధి కావాలి,
యేసయ్యా! మాకు సమృద్ధి కావాలి,
యేసయ్యా! మాకు ఆశీర్వాదము కావాలి,
యేసయ్యా! మాకు సమాధానము కావాలి,
యేసయ్యా! మాకు స్వస్థత కావాలి.

యేసయ్యా! ఎల్షద్దాయి సంఘమును వేయి కుటుంబాల సంఘముగా సమకూర్చండి.
ఆశగొన్న ప్రాణమును తృప్తిపరచువాడా! తండ్రి మహిమార్థమై మమ్ములను బహుగా
ఫలింపజేయండి. ఎల్షద్దాయి సంఘమును నీకిష్టమైన సంఘముగా తయారుచేయండి.
పెండ్లికుమారుడవైన యేసయ్యా!
నీకిష్టమైన వధువుగా ఎల్షద్దాయి సంఘమును సిద్ధపరచండి.

యేసయ్యా! నీవే ప్రధాన కాపరివైయుండి,
నీవే ప్రధాన యాజకుడవైయుండి,
నీవే శిరస్సువైయుండి,
నీవే పెండ్లి కుమారుడవైయుండి,
ఎల్షద్దాయి సంఘమును పాలించండి.

నీ చిత్తమును మాలో నెరవేర్చండి. నీ యిష్టమే సంఘములో జరిగించండి.
లోకసంబంధమైన మా తలంపులుగాని, ఆశలుగాని సంఘములో ఏదియు
నెరవేర్చబడకుండా ప్రతి బాహ్యక్రియలను లయపరచండి.

ప్రభువా! సంఘమును నీ మహిమతో నింపండి.
"నిమిషమాత్రము నేను విసర్జించితిని గొప్ప వాత్సల్యముతో నిన్ను సమకూర్చెదను,
మహోద్రేకము కలిగి నిమిషమాత్రము నీకు విముఖుడనైతిని నిత్యమైన కృపతో నేను
వాత్సల్యతచూపుదును" అని యెషయా 54:7,8లో సెలవిచ్చిన యెహోవా దేవా!
నీ గొప్ప వాత్సల్యముతో ఎల్షద్దాయి సంఘమును సమకూర్చండి.
నిత్యమైన కృపతో ఎల్షద్దాయి సంఘము మీద నీ వాత్సల్యము చూపించండి.

దేవా! మా మొఱ్ఱను ఆలకించండి. మా మనవుల ధ్వని వినండి.
చెదరిపోయిన, తప్పిపోయిన, తొట్రిల్లిన, సాతాను చెరలోనున్న, సంఘ సభ్యులందరిని
తిరిగి సమకూర్చండి. అనేకమంది అన్యజనులను సంఘమునకు నడిపించండి.
వెయ్యి కుటుంబముల సంఘముగా మమ్ములను ఆశీర్వదించండి.

"నీ వెరుగని జనులను నీవు పిలిచెదవు,
నిన్నెరుగని జనులు యెహోవా నిన్ను మహిమపరచగా చూచి
నీ దేవుడైన యెహోవాను బట్టి ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుని బట్టి
నీ యొద్దకు పరిగెత్తి వచ్చెదరు", అని యెషయా 55:5 లో సెలవిచ్చిన దేవా!
మమ్మును ఎరుగని అనేకమంది జనులు నీ మహిమను బట్టి
ఎల్షద్దాయి సంఘమునకు, ఎల్షద్దాయి ప్రార్థన శిఖరమనెడి
నీ మందిరమునకు పరిగెత్తుకొని వచ్చునట్లు కృపచూపించండి.
నీ వాగ్దానమును మా యెడల నెరవేర్చండి.

ప్రభువైన దేవా! సంఘములో ఎవరైతే
కుటుంబ యజమానులు మరి ముఖ్యముగా
బాలురైన యవ్వనస్థులు ధూమపానముల చేతను, మద్యపానము చేతను,
జారత్వము చేతను, అవిధేయత చేతను,
ఏ సాతాను చెరలో చిక్కబడియున్నారో; నీ కృపలో వారిని కరుణించి,
వారిని క్షమించి బంధకాల నుండి విడిపించండి.
ఏ యుగసంబంధమైన దేవత ప్రజల కన్నులకు గ్రుడ్డితనము కలుగజేసియున్నదో;
ఆ యుగసంబంధమైన దేవతాశక్తులను
ఎల్షద్దాయి సంఘపాదముల క్రింద అణగద్రొక్కించండి.

ప్రభువైన యేసయ్యా!
సంఘములోని పురుషులు, స్త్రీలు, యవ్వనస్థులు, బాలబాలికలు, వృద్ధులు,
పసిబిడ్డలు ప్రతి ఒక్కరి చుట్టు నీ పరిశుద్ధ రక్తమును కంచెగావేయండి.
ఎల్షద్దాయి ప్రార్థన శిఖరము చుట్టు నీ అగ్నిని ప్రాకారముగా ఉంచండి.
అపవాదియైన సాతానుపై సంపూర్ణ విజయమును మాకు అనుగ్రహించండి.

దేవా! నీకయాసకరమైన మార్గములు మాలో ఏమేమైతే వున్నవో వాటన్నింటిని
తీసివేసికొనుటకు సిద్ధముగా ఉన్నాము. మమ్ములను ఆశీర్వదించండి.
లక్షలాది మంది ప్రజలకు ఆశీర్వాదకరముగా ఉండునట్లు
ఎల్షద్దాయి సంఘమును అబ్రహాము ఆశీర్వాదములతో నింపండి.
వెయ్యికుటుంబాల సంఘముగా నీవు మమ్ములను అభివృద్ధి పరచెదవని
ఎంతో ఆశతో ఎదురుచూచుచున్నాము.
మా నిరీక్షణను నీవు సిగ్గుపరచవని మనసారా మేము నమ్ముచున్నాము.

"నేను దాని చుట్టు అగ్ని ప్రాకారముగా ఉందును,
నేను దాని మధ్యను నివాసినై మహిమకు కారణముగా వుందును",
అని జెకర్యా 2:5లో సెలవిచ్చిన యెహోవా దేవా!
నీ వాక్కు ప్రకారము ఎల్షద్దాయి సంఘము చుట్టు నీవే అగ్ని ప్రాకారముగా వుండండి.
సంఘము మధ్యన మహిమకు కారణముగా మీరే నివసించండి.
"నేను వారిని విమోచించియున్నాను గనుక వారిని ఈల వేసి పిలిచి
సమకూర్చెదను; మునుపు విస్తరించినట్లు వారు విస్తరించుదురు.
అన్యజనులలో నేను వారిని విత్తగా దూరదేశములలో వారు నన్ను
జ్ఞాపకము చేసుకొందురు, వారును వారి బిడ్డలను సజీవులై తిరిగి వత్తురు",
అని జెకర్యా 10:8,9లో మీరు ఇచ్చిన వాగ్దానములను బట్టి యెహోవా దేవా!
నీకు స్తుతులు స్తోత్రములు. మహిమ ఘనత ప్రభావములు నీకే చెల్లును గాక!

ప్రభువా! ఎక్కువశాతం మంది పురుషులు సంఘప్రార్థనలకు
రాలేక వెనుకబడియున్నారు. స్త్రీలు వస్తున్నారుగాని వారిభర్తలు రాలేకపోతున్నారు;
భార్యలతోపాటు వారి భర్తలను కూడా సంఘమునకు నడిపించండి.
కొన్ని కుటుంబాలలో పురుషులు వస్తున్నారు గాని
వారి భార్యలు రాలేక వెనుకబడిపోతున్నారు.
ప్రతి కుటుంబము నుండి భార్యభర్తలిరువురిని పిల్లలతో సహా సంఘమునకు,
ప్రతి ఆరాధనలకు వచ్చునట్లు కృపచూపి నడిపించండి.
మరికొన్ని కుటుంబాలలో పిల్లలు యవ్వనస్తులు వచ్చుచున్నారు గాని,
తల్లిదండ్రులు రాలేకపోతున్నారు.

ప్రభువా! కుటుంబాలు కుటుంబాలుగా ఎల్షద్దాయి ప్రార్థన మందిరమునకు,
ప్రతి ప్రార్థనలకును, ప్రతి ఆరాధనలకును హాజరగునట్లు
కుటుంబాలను నడిపించండి.
కొన్ని కుటుంబాలలో పిల్లలు, యవ్వనస్తులు లోకమునకు దగ్గరగాను,
నీ సన్నిధికి దూరముగాను తిరుగులాడుచున్నారు.
ప్రభువా! యవ్వనస్తులను, బాలబాలికలందరిని సంఘమునకు నడిపించండి.
"ఈల వేసి పిలిచి సమకూర్చెదను", అని సెలవిచ్చిన దేవా!
అవిధేయతలో వున్న ప్రజలను మీరే విమోచించి సంఘమునకు
ఈల వేసి మరి పిలవండి. మీరే సంఘమును విస్తరింపజేయండి.
ఆత్మీయ జీవితములో మృతులైన వారిని సజీవునిగాలేపి
సంఘమునకు నడిపించండి.

"ఈ కడవరి మందిరము యొక్క మహిమ
మునుపటి మందిరము యొక్క మహిమ మించునని
సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు.
ఈ స్థలమందు నేను సమాధానము నిలుపననుగ్రహించెదను;
ఇదే సైన్యములకు అధిపతియగు యెహోవా వాక్కు".
అని హగ్గయి 2:9లో సెలవిచ్చిన దేవా!

నీ వాగ్దానము ప్రకారము ఎల్షద్దాయి సంఘమునకు నీ మహిమను,
ఈ ప్రార్థన శిఖరమునకు నీ సమాధానమును అనుగ్రహించుచున్నావని
పరిపూర్ణముగా నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాము.

"కోట్లలలో ధాన్యమున్నదా?
ద్రాక్షచెట్లయినను అంజూరపు చెట్లయినను దానిమ్మ చెట్లయినను
ఒలీవ చెట్లయినను ఫలించకపోయెను గదా.
అయితే ఇది మొదలుకొని నేను మిమ్ములను ఆశీర్వదించెదను".
అని హగ్గయి 2:19 లో మీరు ఇచ్చిన వాగ్దానము ప్రకారము మమ్ములను
ఇది మొదలుకొని ఆశీర్వదించండి.
ఫలించలేక అభివృద్ధిలేక, సమృద్ధి లేక, వ్యాకులపడుచున్నాము.
మా దుఃఖములను సంతోషముగా మార్చండి.

ప్రభువైన దేవా! మమ్ములను వెయ్యికుటుంబాల
సంపూర్ణ సత్యసువార్త సంఘముగా ఆశీర్వదించండి.
"మీరు కడుపార తిని తృప్తి పొంది మీ కొరకు వింత కార్యములను
జరిగించిన మీ దేవుడైన యెహోవా నామమును స్తుతించునట్లు
నేను పంపిన మిడుతలను, గొంగలి పురుగులను,
పసరు పురుగులను, చీడ పురుగులను అను నా మహా సైన్యమును
తినివేసిన సంవత్సరముల పంటను మీకు మరలనిత్తును.
నా జనులు ఇక నెన్నటికిని సిగ్గునొందరు". అని యోవేలు 2:25,26లో సెలవిచ్చిన
దేవా, యెహోవా! నీ జనులైన ఎల్షద్దాయి సంఘమును ఇక యెన్నటికిని
సిగ్గుపడనీయవని మిడతల చేతను, గొంగలి పురుగుల చేతను,
పసర పురుగుల చేతను, చీడ పురుగుల చేతను,
తినివేయబడిన సంఘసభ్యులను తిరిగి
ఎల్షద్దాయి సంఘపాలమునకు సమృద్ధి పంటగా అనుగ్రహించండి.
ఈ విధముగా నీవు చేయనైయున్నందులకు నీకు స్తుతి స్తోత్రములు.
"ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము
మీతో కూడా ఉన్నానని",
మత్తయి 28:20లో
వాగ్దానమును చేసిన యేసుదేవా!
సంఘము మధ్యాకాశమునకు ఎత్తబడు వరకు
ఎల్పద్దాయి సంఘమునకు మీరే సదాకాలము తోడైయుండమని
నీ నామములోనే ప్రార్థించి స్తుతించి
వేడుకొనుచున్నాము తండ్రీ. ఆమేన్.. .ఆమేన్... ఆమేన్...

EL-Shaddai Full Gospel Church
IMMANUEL FOUNDATION (REGD.)
Ponnapuram Colony, Nandyal - 518501